ప్రజావీక్షణం దినపత్రిక
విలేకర్లు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో
ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ
ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా.?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా.?
అయితే రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా
జిల్లాలు, మండలాల వారీగా నిబద్ధతతో
పని చేసే విలేకరులు కావలెను
PJV ప్రజా వీక్షణం టీవీ
9866330400


# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్



PJV ప్రజా వీక్షణం టీవీ
Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :201 15 సోమవారం, జూన్ 2026 పేజీలు : 08 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari

# అమెరికాకు ప్రభుత్వం దాసోహం అంటోంది

▶ భారతీయ నావికుల మృతి: ఈ బలహీన ప్రధాని దేశాన్ని కాపాడలేరంటూ రాహుల్ గాంధీ ఫైర్ ▶ హర్మూజ్ జలసంధిలో భారత నావికుల మృతిపై మోదీ సర్కార్‌ను నిలదీసిన రాహుల్ గాంధీ ▶ భారతీయుల మృతి పట్ల అమెరికాలో పశ్చాత్తాపం లేదని ఆవేదన ▶ ఈ ఘటనపై అమెరికా బేషరతుగా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ ▶ ప్రభుత్వ స్పందన బలహీనంగా ఉందని విపక్షాల ఆరోపణ



తెలంగాణ జూన్ 14 ప్రజావీక్షణం

హర్మూజ్ జలసంధిలో అమెరికా సైనిక దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో కేంద్రం అమెరికాకు ఒక నమ్మకమైన సేవకుడిలా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. అమెరికా ఏమాత్రం పశ్చాత్తాపం చూపకపోగా, వారి ఆదేశాలను పాటించని నౌకలను సహించబోమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో హెచ్చరించడాన్ని ఆయన తప్పుబట్టారు. "అమెరికా దాడుల్లో మన ముగ్గురు నావికులు చనిపోయి కొద్ది రోజులే అయింది. అయినా ఇంతవరకు వారి నుంచి కనీసం పశ్చాత్తాపం లేదు, క్షమాపణ లేదు. పైగా, మనకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. "అమెరికా సైన్యం ఆదేశాలను తక్షణమే పాటించాలి. ఎలాంటి ఉల్లంఘనలైనా సహించేది లేదు" అన్న వారి మాటలు చూడండి. ఒక స్వతంత్ర దేశం ఇలాంటి భాషను ఎప్పటికీ సహించదు. కానీ మన బలహీన ప్రధాని మాత్రం నోరు మెదపడం లేదు. ఒక విధేయుడైన సేవకుడిలా వారి ఆదేశాలను వింటున్నారు, పాటిస్తున్నారు. ఈ బలహీన ప్రధాని దేశ



## ఫ్రాన్స్‌లో మోదీ పర్యటన..

-మేక్రాన్‌తో కలిసి చారిత్రక 'విల్లా కెర్లియోస్' సందర్శన
-ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో పర్యటిస్తున్న ప్రధాని మోదీ
-'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని ప్రారంభించిన మోదీ, మేక్రాన్
-దేశంలో స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరిస్తుందన్న మోదీ
-ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరపనున్న నేతలు

తెలంగాణ జూన్ 14 ప్రజావీక్షణం

ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆదివారం ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో ఉన్న చారిత్రక 'విల్లా కెర్లియోస్'ను సందర్శించారు. మిగతా 2 లో




## భారత జెండాతో ఉన్న నౌక ఒమన్ తీరంలో మునక..

### సిబ్బంది సురక్షితం..!

తెలంగాణ జూన్ 14 ప్రజావీక్షణం

ఒమన్ తీరం లో భారత జెండా తో ప్రయాణిస్తున్న ఓ నౌక నీటమునిగింది. యాంత్రిక లోపం కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకోగా.. అందులోని 14 మంది భారతీయ సిబ్బందిని కాపాడినట్లు అధికారులు తెలిపారు. మిగతా 2 లో




## దేశ ఆర్థికవ్యవస్థపట్ల తమ శ్రద్ధను రాహుల్‌గాంధీ గుర్తించలేకపోతున్నారు-నిర్మలా సీతారామన్ 02

నౌకల కదలికలపై

## కఠిన చర్యలు..

ఇరాన్ నావికాదళం ఆడియో రికార్డింగ్ కలకలం!
హర్మూజ్ జలసంధిని పూర్తిగా మూసివేసినట్లు ఇరాన్ నావికాదళం రేడియో ప్రకటన
హెచ్చరికలను ధిక్కరించి నౌకలు ప్రయాణిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఐఆర్‌జీసీ హెచ్చరిక
వాణిజ్య నౌకలపై దాడికి వచ్చిన ఇరాన్ డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేత మిగతా 2 లో






## అఖిలేష్ కుమార్తెపై అసభ్యకర కామెంట్స్..

### యూపీ సీఎం యోగీ సీరియస్

తెలంగాణ జూన్ 14 ప్రజావీక్షణం

సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ కుమార్తెపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఖండించారు. నిందితులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. మిగతా 2 లో

మీనాక్షి నటరాజన్‌పై

## రేవంత్ కుట్ర

మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచింది రేవంత్

- ఆమెకు రాజ్యసభ సీటు రాకుండా బీజేపీతో రేవంత్ కుమ్మక్కయ్యారని ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శలు
- ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక రావడం ఖాయమని జోస్యం
- ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణ జూన్ 14 ప్రజావీక్షణం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. సొంత పార్టీ నేత, రాహుల్ గాంధీకి సన్నిహితురాలైన మీనాక్షి నటరాజన్‌కు రేవంత్ రెడ్డి వెన్నుపోటు పొడిచారని, ఆమెపై తప్పుడు కేసు బనాయించి వేధించారని విమర్శించారు. ఆమెకు మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ సీటు రాకుండా అడ్డుకునేందుకు బీజేపీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. మిగతా 2 లో


## లెబనాన్‌పై ఇజ్రాయెల్ మళ్లీ దాడులు..

### ముగ్గురు మృతి



తెలంగాణ జూన్ 14 ప్రజావీక్షణం

: ఇజ్రాయెల్-హెజ్బొల్లా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. లెబనాన్‌పై మరోసారి ఇజ్రాయెల్ దాడులతో విరుచుకుపడింది. బీరూట్ లోని హెజ్బొల్లా ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ వైమానిక దాడి చేసింది.



## నాకు బహిరంగ క్షమాపణలు చెప్పండి..

### మమతాబెనర్జీకి రెబల్ ఎంపీ కుమారుడి లీగల్ నోటీస్



తెలంగాణ జూన్ 14 ప్రజావీక్షణం

తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ కుమారుడు డాక్టర్ బైద్యనాథ్ ఘోష్ .. బెంగాల్ మాజీ సీఎం మమతాబెనర్జీ కి లీగల్ నోటీసులు పంపారు. టీఎంసీ ఎంపీలు కల్యాణ్ బెనర్జీ , సౌగతా రాయ్ మహువా మొయిత్రా లకు కూడా 2 లో

ప్రజావీక్షణం
దినపత్రిక

# టీవీకే ప్రభుత్వం బీజేపీ జిరాక్స్ కాపీ.. ఎంకే స్టాలిన్

జూన్ 14 ప్రజావీక్షణం

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌పై శనివారం మరోమారు డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ విరుచుకుపడ్డారు. టీవీకే ప్రభుత్వం ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టే చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. విజయ్ నేతృత్వంలోని తమిళనాడు సర్కార్ బీజేపీకి జిరాక్స్ కాపీ మాదిరిగా పనిచేస్తున్నదన్నారు.అన్నా అరివాలయంలో జరిగిన డీఎంకే మహిళా వింగ్ సమావేశంలో పాల్గొన్న స్టాలిన్ మాట్లాడుతూ ప్రతిపక్షాన్ని బలహీనపరిచే ప్రయత్నంలో భాగంగా ముఖ్యమంత్రి అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే పనిలో ఉన్నారని ఆరోపించారు. ఆయనకు సొంత పార్టీ కేడర్‌పై నమ్మకం లేదని, ఇతర రాష్ట్రాల్లోని బీజేపీ చేస్తున్న పనులనే విజయ్ ఇక్కడ చేస్తున్నారన్నారు.



# బ్రిగేడియర్.. అంటూ యువకుడి హల్‌చల్..
## యూపీలో నకిలీ ఆర్మీ అధికారి అరెస్ట్

తెలంగాణ జూన్ 14 ప్రజావీక్షణం

భారత ఆర్మీ బ్రిగేడియర్‌గా నటిస్తూ పలువురిని మోసగిస్తున్న 21 ఏండ్ల యువకుడిని యూపీలోని షాజహాన్‌పూర్ జిల్లాలో పోలీసులు అరెస్ట్ చేశారు. షాజహాన్‌పూర్ స్టేషన్ హెడ్‌క్వార్టర్స్, స్థానిక మాజీ సైనికులు నిర్వహించిన ఒక రహస్య ఆపరేషన్‌లో అతడిని అరెస్ట్ చేశారు. ఆర్యన్ వర్మ అనే యువకుడు ఇండియన్ ఆర్మీ బ్రిగేడియర్ యూనిఫాం వేసుకుని తన టాటా హారియర్ వాహనానికి ఆర్మీ హెడ్ క్వార్టర్స్ జెండాతో పాటు ఒక స్టార్ ప్లేట్‌ను అమర్చుకున్నాడు.అతని రక్షణ సిబ్బందిలా కనిపించేందుకు ఇద్దరిని నియమించుకుని షజ్‌హాన్‌పూర్‌లో తిరుగుతుండే వాడు. రెండు నెలలుగా ఆతనిపై ఫిర్యాదులు రావడంతో నిఘా వేసిన అధికారులు జూన్ 12న ఒక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిలిపించి, అతను నకిలీ ఆర్మీ అధికారి అని నిర్ధారించుకుని అరెస్ట్ చేశారు. అతని నుంచి నకిలీ ఐడీ కార్డు, ఒక ఎయిర్ పిస్టల్ స్వాధీనం చేసుకున్నారు. అతనితో ఉన్న ఇద్దరిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.





# ఖమేనీ అంత్యక్రియల షెడ్యూల్ ఖరారు.. జూలై 4న షురూ..
## 6, 7 తేదీల్లో అంతిమయాత్రలు.. 9న ఖననం..!

తెలంగాణ జూన్ 14 ప్రజావీక్షణం

ఇరాన్ దేశాన్ని సుదీర్ఘ కాలంపాటు పరిపాలించిన మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల అధికారిక షెడ్యూల్ ఖరారైంది. వచ్చే నెల (జూలై) 4 నుంచి రాజధాని టెహ్రాన్ (౧వప్త్రతీఖఅ) లో ఈ అంత్యక్రియల ప్రక్రియ ప్రారంభం కానుందని ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా ఆదివారం వెల్లడించింది. ఖమేనీ సంస్మరణ బాధ్యతలను పర్యవేక్షిస్తున్న ప్రధాన కమిటీ ఈ మేరకు ఒక అధికారిక ప్రకటనను విడుదల చేసింది.కమిటీ ప్రకటన ప్రకారం.. జూలై 4, 5 తేదీల్లో టెహ్రాన్‌లోని ప్రసిద్ధ ఇమామ్ ఖమేనీ ముసల్లా ప్రార్థనా మందిరంలో ఖమేనీ పార్థివ దేహానికి వీడ్కోలు వేడుకలు నిర్వహిస్తారు. అనంతరం జూలై 6, 7 తేదీల్లో రాజధాని టెహ్రాన్, పవిత్ర నగరం కోమ్ లలో భారీ అంతిమ యాత్రలు సాగుతాయి. 9న దేశ ఈశాన్య ప్రాంతంలోని మషాద్ నగరంలో తుది వీడ్కోలు కార్యక్రమం ముగుస్తుంది. అదే రోజున షియా ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే ఎనిమిదో ఇమామ్ 'ఇమామ్ రెజా' పవిత్ర క్షేత్రంలో ఖమేనీ దేహాన్ని ఖననం చేయనున్నారు.నిజానికి మార్చి నెలలోనే జరగాల్సిన ఈ అంత్యక్రియలు యుద్ధ పరిస్థితుల కారణంగా వాయిదా పడుతూ వచ్చాయి. 86 ఏళ్ల అలీ ఖమేనీ ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన భారీ వైమానిక దాడుల్లో మరణించారు. ఈ దాడితో ఇరాన్‌పై ఆయన సాగించిన 36 ఏళ్ల పాలన ముగిసింది. ఖమేనీ మరణం తర్వాత మార్చి మొదటి వారంలో ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టారు. కాగా ఈ దాడుల్లో ఖమేనీతోపాటు ఆయన కుమార్తె, మనవడు, అల్లుడు, మరో నలుగురు కుటుంబసభ్యులు కూడా ప్రాణాలు కోల్పోయారు.




# భారత జెండాతో ఉన్న నౌక ఒమన్ తీరంలో మునక..


మొదటిపేజీ తరువాయి

వారంతా సురక్షితంగా, ఆరోగ్యంగా ఉన్నారని ముంబై కి వెళ్తున్న మరో నౌకలో వారిని ఎక్కించినట్లు ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. భారత జెండాతో ప్రయాణిస్తున్న 'ఎంఎస్‌వీ విరాట్ 1' నౌకకు సంబంధించిన సహాయక చర్యలు విజయవంతంగా పూర్తయ్యాయి.మొత్తం 14 మంది సిబ్బందిని రక్షించామని, వీరంతా ప్రస్తుతం 'జబల్ అలీ 9' నౌకలో ముంబైకి బయలుదేరారని భారత ఎంబసీ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది. అంతకుముందు ఒమన్ తీరంలో ఓ నౌక నిలిచిపోయిందని, ఇంజిన్ వైఫల్యమే దీనికి కారణమని పేర్కొన్నది. నౌకలోని సిబ్బంది లైఫ్ రాఫ్ట్‌లోకి మారారని, ఒమన్ అధికారుల సమన్వయంతో సమీపంలోని నౌకల ద్వారా వారి తరలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది. ఒమన్ తీర ప్రాంతానికి సమీపంలో ఓ చమురు ట్యాంకర్‌లో విధులు నిర్వహిస్తున్న భారతీయ నావికుడు నిశాంత్ ఉర్తనాథన్ అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఘటనపైనా రాయబార కార్యాలయం స్పందించింది.

# భారత్ 'ఐరన్ డోమ్' తరహా రక్షణ కవచానికి భారీ బూస్ట్.డి ఆర్ డి ఓ వరుస విజయాలతో మరింత బలమైన క్షిపణి రక్షణ వ్యవస్థ

(ప్రజావీక్షణం జూన్ 14 )

భారత్ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తూ, రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ ( డి ఆర్ డి ఓ ) జూన్ 10 మరియు 11 తేదీల్లో నిర్వహించిన కీలక పరీక్షల్లో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. వరుసగా రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పరీక్షలు దేశ క్షిపణి రక్షణ వ్యవస్థలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికాయి.బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ ( బి ఎండి ) వ్యవస్థ అంటే ఏమిటి?శత్రు దేశం ప్రయోగించే బాలిస్టిక్ క్షిపణులు అత్యంత వేగంతో ప్రయాణించి లక్ష్యాన్ని చేరుకుంటాయి. ఇటువంటి క్షిపణులను గాల్లోనే గుర్తించి, వాటిని లక్ష్యానికి చేరకముందే ధ్వంసం చేసే వ్యవస్థనే అంటారు.అమెరికా, రష్యా, ఇజ్రాయెల్ వంటి కొద్దిమంది దేశాలకే ఈ తరహా అధునాతన సాంకేతికత ఉంది. ఇప్పుడు భారత్ కూడా ఆ జాబితాలో మరింత బలంగా నిలుస్తోంది.రెండు పొరల రక్షణ వ్యవస్థ డి ఆర్ డి ఓ పరీక్షించిన వ్యవస్థలో రెండు రకాల ఇంటర్‌సెప్టర్లు పనిచేస్తాయి.భూమి వాతావరణం వెలుపలే శత్రు క్షిపణిని అడ్డుకుంటుంది.ఒకవేళ మొదటి పొరలో తప్పించుకున్నా, భూమి వాతావరణంలోకి వచ్చిన తర్వాత రెండో దశలో ధ్వంసం చేస్తుంది.అంటే శత్రు క్షిపణికి లక్ష్యాన్ని చేరుకునే అవకాశాన్ని గణనీయంగా తగ్గించే "డబుల్ సెక్యూరిటీ షీల్డ్" ఇది.ఏ రకం క్షిపణులను అడ్డుకోగలదుఈ పరీక్షల్లో 2,000 నుంచి 5,000 కిలోమీటర్ల శ్రేణి కలిగిన (ఐ ఆర్ బి ఎం ఎస్ ) ను అనుకరించి పరీక్షలు నిర్వహించారు.ఇలాంటి క్షిపణులు సాధారణంగా అణ్వాయుధాలను మోసుకెళ్లగలవు. వాటిని గాల్లోనే అడ్డుకునే సామర్థ్యాన్ని భారత్ విజయవంతంగా ప్రదర్శించడం వ్యూహాత్మకంగా చాలా కీలకం.నౌకాదళానికి మరో శక్తివంతమైన ఆయుధంఇదే సమయంలో డి ఆర్ డి ఓ అభివృద్ధి చేసిన తొలి ప్రయోగంకూడావిజయవంతమైంది.ఈ క్షిపణి ద్వారాశత్రు యుద్ధ నౌకలను దూరం నుంచే లక్ష్యంగా చేసుకోవచ్చు.భారత నౌకాదళం దాడి సామర్థ్యం మరింత పెరుగుతుంది.హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత వ్యూహాత్మక ఆధిపత్యం బలోపేతం అవుతుంది.ప్రపంచ స్థాయిలో భారత్ స్థానంప్రస్తుతం పూర్తి స్థాయి బహుళ-పొరల క్షిపణి రక్షణ వ్యవస్థలను అభివృద్ధి చేసిన దేశాలు చాలా తక్కువ అమెరికా, రష్యా, ఇజ్రాయెల్,



చైనా , ఈ జాబితాలో భారత్ కూడా వేగంగా తన స్థానాన్ని బలోపేతం చేసుకుంటోంది.ఎందుకు ఇది చారిత్రాత్మక విజయం దేశంలోని కీలక నగరాలు, సైనిక స్థావరాలు, వ్యూహాత్మక కేంద్రాలకు మరింత రక్షణ.అణు మరియు బాలిస్టిక్ క్షిపణి బెదిరింపులకు సమర్థవంతమైన ప్రతిస్పందన.స్వదేశీ సాంకేతికతపై భారత సామర్థ్యానికినిదర్శనం.ఆత్మనిర్భర్ భారత్" లక్ష్యానికి మరో పెద్ద అడుగు.భవిష్యత్తులో దేశవ్యాప్తంగా మరింత విస్తృత క్షిపణి రక్షణ కవచం ఏర్పాటు చేసే దిశగా కీలక పురోగతి.భారత్ కేవలం క్షిపణులను తయారు చేసే దేశంగా మాత్రమే కాకుండా, శత్రు క్షిపణులను గాల్లోనే ధ్వంసం చేసే అత్యాధునిక రక్షణ వ్యవస్థలను రూపొందించే దేశంగా ఎదుగుతోంది. ఐ=ఐూ తాజా విజయాలు భారత రక్షణ రంగ స్వావలంబనకు, జాతీయ భద్రతకు, వ్యూహాత్మక నిరోధక శక్తికి మరింత బలం చేకూర్చాయి.

# అమెరికాకు ప్రభుత్వం దాసోహం అంటోంది

మొదటిపేజీ తరువాయి

అందుకే మన వాళ్లను చంపినా, మనల్ని అవమానించినా ఆయన మౌనంగా ఉండిపోతున్నారు. ఇది దేశ ప్రజలందరూ గమనించాలి" అంటూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు.కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర నేతలు కూడా కేంద్రంపై విరుచుకుపడ్డారు. ఈ ఘటనపై అమెరికా బేషరతుగా క్షమాపణ చెప్పాలని పవన్ ఖేరా డిమాండ్ చేశారు. విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందన చాలా బలహీనంగా ఉందని, ఆయన కేవలం "ఇది సమర్థనీయం కాదు" అనడం సరికాదని అన్నారు. మరో నేత మనీశ్ తివారీ మాట్లాడుతూ, అమెరికా మంత్రి వ్యాఖ్యలు బెదిరింపుగా ఉన్నాయని, నావికుల మృతికి వారే కారణమన్నట్లుగా ఉన్నాయని ఆరోపించారు.మరోవైపు, ఈ ఘటనపై భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అమెరికాతో మాట్లాడి, నావికుల మృతిపై తీవ్ర నిరసన తెలిపినట్లు వెల్లడించారు. వాణిజ్య నౌకలపై ప్రాణాంతక దాడులు సమర్థనీయం కాదని స్పష్టం చేసినట్లు తెలిపారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతల నేపథ్యంలో జరిగిన ఈ ఘటన, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంపై ప్రతిపక్షాలకు ప్రధాన అస్త్రంగా మారింది.

# లెబనాన్‌పై ఇజ్రాయెల్ మళ్లీ దాడులు..

మొదటిపేజీ తరువాయి

దాడికి సంబంధించిన దృశ్యాలను ఇజ్రాయెల్ వైమానిక దళం ఆదివారం పోస్ట్ చేసింది. బీరూట్ శివార్లలోని హెజ్బొల్లా బలమైన స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. పేలుడు సంభవించడంతో భవనం చుట్టూ దట్టమైన పొగలు కమ్ముకున్నాయి.లెబనాన్ అధికారిక నేషనల్ న్యూస్ ఏజెన్సీ కథనం ప్రకారం.. హెజ్బొల్లాకు బలమైన కేంద్రంగా ఉన్న దక్షిణ బీరూట్ శివార్లలోని దాహియేలోని ఘోబెయరీ పరిసరాల్లోని ఓ భవనంపై ఈ దాడి జరిగింది. ఈ దాడి జరిగిన సమయంలో అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న రోడ్డుపై వాహనాలు వెళ్తుండటం కూడా ఈ వీడియోలో కనిపిస్తోంది. అయితే ఈ దాడిలో ఏవైనా వాహనాలు దెబ్బతిన్నాయా అనేదానిపై స్పష్టత లేదు. ఇరాన్ మద్దతు ఉన్న హెజ్బుల్లా గ్రూప్ ఉత్తర ఇజ్రాయెల్ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటే.. తాము దక్షిణ బీరూట్‌పై దాడి చేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో సహా పలువురు అధికారులు హెచ్చరించారు.ఈ నిర్ణయానికి వాషింగ్టన్ మద్దతు కూడా ఉందని వారు పేర్కొన్నారు. హెజ్బొల్లా ప్రయోగించినట్లుగా అనుమానిస్తున్న మూడు డ్రోన్లు ఉత్తర ఇజ్రాయెల్‌పై వేర్వేరు ఘటనల్లో దాడి చేశాయని.. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఇజ్రాయెల్ సైన్యం ఇవాళ తెల్లవారుజామున తెలిపింది. ఇజ్రాయెల్ భద్రతకు, ఐడీఎఫ్ దళాలకు ముప్పుగా ఉన్న ఏ లక్ష్యాన్నైనా నిర్వీర్యం చేసేందుకు తాము చర్యలు కొనసాగిస్తామని ఇజ్రాయెల్ వైమానిక దళం స్పష్టంచేసింది. హిజ్బుల్లా మాత్రం దక్షిణ లెబనాన్‌లోకి చొరబడ్డ ఇజ్రాయెల్ దళాలపై పలు దాడులు జరిపినట్లు ప్రకటించినప్పటికీ.. ఉత్తర ఇజ్రాయెల్‌పై డ్రోన్ దాడులకు తామే బాధ్యులమని ప్రకటించలేదు.

# మీనాక్షి నటరాజన్‌పై రేవంత్ కుట్ర

మొదటిపేజీ తరువాయి

ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి అవినీతి, భూ ఒప్పందాలపై మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారని, దీనికి ప్రతీకారంగానే హైదరాబాద్‌లో ఆమెపై తప్పుడు కేసు పెట్టించారని అన్నారు. సొంత పార్టీ నేతలనే వెన్నుపోటు పొడిచే నైజం రేవంత్ రెడ్డిదని ఆయన దుయ్యబట్టారు. హిట్లర్ తన ఆదర్శం అని సీఎం చెప్పడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ పాలనను 'అట్టర్ ఫ్లాప్ సినిమా'గా అభివర్ణించిన కేటీఆర్, ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని, కనీసం 4,000 ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని ప్రశ్నించారు. రూ.4,000 నిరుద్యోగ భృతి హామీని కూడా విస్మరించారని మండిపడ్డారు. కోటి మంది మహిళలను లక్షాధికారులను చేశామని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు.ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక రావడం ఖాయమని కేటీఆర్ జోస్యం చెప్పారు. ప్రజాతీర్పును ధిక్కరించి దానం నాగేందర్ కాంగ్రెస్‌లోకి ఫిరాయించడమే దీనికి కారణమని స్పష్టం చేశారు. జూన్ 25 నుంచి జరిగే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని, డిజిటల్ సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

# ఫ్రాన్స్‌లో మోదీ పర్యటన..

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఇద్దరు నేతలు తేలికపాటి సంభాషణలో మునిగిపోయారు. విల్లాను కలియతిరుగుతూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.విల్లా కెరిలోస్ అనేది 20వ శతాబ్దం ప్రారంభంలో నిర్మించిన ఒక అసాధారణమైన హౌస్ మ్యూజియం. క్రీస్తుపూర్వం 2వ శతాబ్దానికి చెందిన ఒక ప్రాచీన గ్రీకు ఉన్నత కుటుంబ నివాసాన్ని నమూనాగా తీసుకుని, ఎంతో నిశితంగా ఆధునిక కాలంలో దీన్ని పునఃసృష్టించారు. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరా తీరంలో, నైస్ మరియు మొనాకో నగరాల మధ్య ఉన్న బ్యూలీ-సర్-మెర్ అనే ప్రాంతంలో ఈ విల్లా ఉంది. మధ్యధరా సముద్రానికి అభిముఖంగా ఒక రాతి ద్వీపకల్పంపై కొలువై ఉన్న ఈ భవనం, ప్రస్తుతం చారిత్రక కట్టడంగా వర్గీకరించబడింది. దీని యాజమాన్య హక్కులను 'ఇన్‌స్టిట్యూట్ డి ఫ్రాన్స్' కలిగి ఉంది.అంతకుముందు, నీస్‌లో జరిగిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని మోదీ, మేక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత్‌లో సంస్కరణల వేగం తగ్గబోదని స్పష్టం చేశారు. దేశంలోని స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరణకు సిద్ధంగా ఉందన్నారు. గత 11-12 ఏళ్లలో బలమైన ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించుకున్నామని, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ అవతరించిందని గుర్తు చేశారు. ప్రపంచ సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చేసేందుకు తమతో కలిసి పనిచేయాలని ప్రపంచ ఆవిష్కర్తలను ఆయన ఆహ్వానించారు.ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకావడం ఫ్రాన్స్‌కు ఎంతో గౌరవకారణమని అధ్యక్షుడు మేక్రాన్ అన్నారు. భారత నేతగా 12 ఏళ్లు పూర్తి

# నాకు బహిరంగ క్షమాపణలు చెప్పండి..

మొదటిపేజీ తరువాయి

నోటీసులు పంపించారు. బరసత్ అసెంబ్లీ స్థానంలో పోటీ చేయడానికి తాను పార్టీ టికెట్ కోరానని టీఎంసీ నేతలు చేసిన ఆరోపణలపై బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు.ఈ నెల మొదట్లో జరిగిన ఓ కార్యక్రమంలో మమతాబెనర్జీ మాట్లాడుతూ.. బరసత్ నుంచి ఎమ్మెల్యే టికెట్ కోసం కొంతమంది తనను సంప్రదించారని పేర్కొన్నారు. అయితే పార్టీలోని సీనియర్ నేతలు అందుకు ఒప్పుకోకపోవడంతో వారు చేసిన అభ్యర్థనను తిరస్కరించినట్లు తెలిపారు. ఒకరు ఎంపీ అయినంత మాత్రాన కుటుంబంలోని వారందరూ ఎంపీలు, ఎమ్మెల్యేలు అవ్వాలా అంటూ పరోక్షంగా కకోలీ ఘోష్‌పై విమర్శలు చేశారు. ఈ క్రమంలోనే కకోలి టీఎంసీని వీడడంతో తన కుమారుడికి టికెట్ ఇవ్వనందుకే ఎన్డీఏకు మద్దతిచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఆరోపణలను బైద్యనాథ్ ఘోష్ ఖండించారు.పదవి కోసం తాను ఎప్పుడూ ఆశ పడలేదని బైద్యానాథ్ చెప్పారు. తన కుటుంబ పరువుకు నష్టం కలిగేలా వ్యాఖ్యలు చేసినందుకు మమతతో సహా ఇతర నేతలకు నోటీసులు పంపినట్లు వెల్లడించారు. టీఎంసీ నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు బయటకు వెళ్లిపోవడంతో నిర్మాణాత్మక పునర్వ్యవస్థీకరణలో భాగంగా మమతా బెనర్జీ పలు మార్పులు చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. టీఎంసీ యువజన విభాగం అధ్యక్షురాలిగా నియమించిన వారం రోజులకే.. సయోని ఘోష్ ఎన్డీఏకు మద్దతిస్తున్నట్లు తెలపడంతో ఆమె స్థానంలో పార్టీ నేత అర్నబ్ బెనర్జీని యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించినట్లు పేర్కొన్నాయి.

# అఖిలేష్ కుమార్తెపై అసభ్యకర కామెంట్స్..

మొదటిపేజీ తరువాయి

నేతల కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావొద్దని హితవు పలికారు. అఖిలేష్ యాదవ్ కుమార్తెపై అసభ్యకరమైన కామెంట్స్‌తో మార్ఫింగ్ చేసిన చిత్రాలను కొందరు దుండగులు సోషల్ మీడియాలో పోస్టు చేశారుఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా యోగి ఆదిత్యనాథ్ దీనిపై స్పందించారు. అఖిలేష్ యాదవ్ కుమార్తె లక్ష్యంగా కొందరు తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఆ పోస్టులు తన దృష్టికి వచ్చాయన్నారు. నిందితులపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆడపిల్లలు అందరికీ సమానమేనని, వారిని గౌరవించాలని సూచించారు. ప్రతి ఇంట్లో కుమార్తె, సోదరి ఉంటారని, ఇతరులను కూడా అదే భావనతో చూడాలని అన్నారు. అఖిలేష్ కుమార్తె తనకు కుమార్తెతో సమానమని చెప్పారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# దేశ ఆర్థికవ్యవస్థపట్ల తమ శ్రద్ధను రాహుల్‌గాంధీ గుర్తించలేకపోతున్నారు

మొదటిపేజీ తరువాయి

: దేశ ఆర్థికవ్యవస్థ, కుటుంబాల సంక్షేమం విషయంలో తాము చూపిస్తున్న శ్రద్ధను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తించలేకపోతున్నారని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆయన లోక్‌సభ లో మాట్లాడిన ప్రతిసారీ కేవలం విమర్శలకే పరిమితమవుతారని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకునే క్రమంలో దేశం సాధించిన విజయాలను తక్కువ చేసి చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో వికసిత్ భారత్ సంకల్ప సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొని ప్రసంగించారు.'భారీ విపత్తు ముంచుకొస్తోందని, రాబోయే కొద్ది వారాల్లో అంతా కుప్పకూలిపోతుందని రాహుల్ గాంధీ తరచూ అంటుంటారు. ఆయన చెబుతున్నట్లుగా దేశంలో ఎలాంటి సంక్షోభం లేదు. ఆర్థికవ్యవస్థ ఏటికేడు అత్యంత వేగంగా వృద్ధి చెందుతోంది. జీడీపీ గణాంకాలూ దీనిని సూచిస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి కూడా ఇదే విషయాన్ని పేర్కొన్నది. అయినప్పటికీ భారత్ సంక్షోభంలో ఉందని ప్రజల్లో తప్పుడు అభిప్రాయం కలిగించేందుకు యత్నిస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలోనూ దేశం ప్రగతి పథంలో సాగుతోంది. ఇంధన సరఫరాలు నిరంతరాయంగా కొనసాగేలా ప్రధాని మోదీ చర్యలు తీసుకున్నారు' అని చెప్పారు.ప్రధాని మోదీ నేతృత్వంలో 12 ఏళ్ల పాలన.. అభివృద్ధి, సంక్షేమంతో సాగిందని నిర్మలా సీతారామన్ చెప్పారు. మొత్తం 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. గ్రామీణ పారిశుద్ధ్య కార్యక్రమాల కింద 12 కోట్ల మరుగుదొడ్లను నిర్మించామని అన్నారు. ప్రస్తుతం దేశంలో 58 కోట్ల జన్‌ధన్ ఖాతాలు ఉన్నాయని వెల్లడించారు. మొత్తం 144 కోట్ల ఆధార్‌లు, 125 కోట్ల మొబైల్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. డిజిటల్ లావాదేవీలకు 'యూపీఐ' ఓ నమూనాగా మారిందని నిర్మలా సీతారామన్ తెలిపారు.

# నౌకల కదలికలపై కఠిన చర్యలు..

మొదటిపేజీ తరువాయి

అంతర్జాతీయ చమురు, సహజ వాయువుల రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరాయి. ఈ వ్యూహాత్మక జలసంధిని ఇరాన్ పూర్తిగా మూసివేసింది. ఈ పరిసర ప్రాంతాల్లో ప్రయాణించే వాణిజ్య నౌకలు హోర్మూజ్ జలసంధి వైపు రావద్దని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (×=+జ) నావికాదళం హెచ్చరికలు జారీ చేసింది. పబ్లిక్ మారిటైమ్ రేడియో ఛానల్ ద్వారా ఇరాన్ నావికాదళం పంపిన ఈ హెచ్చరికల ఆడియో రికార్డింగ్ ఇప్పుడు అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది.ఆ ప్రాంతంలో ప్రయాణిస్తున్న ఒక వాణిజ్య నౌక సిబ్బంది అందించిన ఆడియో రికార్డింగ్ ప్రకారం.. పర్షియన్ గల్ఫ్, ఒమన్ గల్ఫ్ పరిధిలో ఉన్న అన్ని నౌకలను ఉద్దేశించి ఐఆర్‌జీసీ హెచ్చరికలు జారీ చేసింది. "హర్మూజ్ జలసంధిని ప్రస్తుతం పూర్తిగా మూసివేయడం జరిగింది. ఈ జలసంధి గుండా ఎలాంటి నౌకల కదలికలు ఉన్నా వాటిని చాలా కఠినంగా ఎదుర్కొంటాం. మీ ఆరోగ్యం, భద్రత దృష్ట్యా, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు హర్మూజ్ జలసంధి వైపు రాకుండా దూరంగా ఉండండి" అని ఆ రేడియో సందేశంలో ఇరాన్ స్పష్టం చేసింది.

**ట్రంప్ శాంతి ఒప్పందం - డ్రోన్ల కూల్చివేత**

ఈ ఉద్రిక్తతల నడుమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం ఒక కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఆదివారం (జూన్ 14) ఒక శాంతి ఒప్పందం కుదరబోతోందని, ఆ ఒప్పందంపై సంతకాలు ముగిసిన వెంటనే హర్మూజ్ జలసంధిని తిరిగి తెరుస్తారని ట్రంప్ వెల్లడించారు. అయితే, మరోవైపు క్షేత్రస్థాయిలో ఘర్షణ వాతావరణం కొనసాగుతూనే ఉంది. హర్మూజ్ జలసంధిలోని వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ పంపిన పలు డ్రోన్లను తాము విజయవంతంగా కూల్చివేసినట్లు అమెరికా సైన్యం శుక్రవారం రాత్రి ప్రకటించింది.

# పుట్లగట్లగూడెంలో కూటమి నాయకుల పర్యటన : మంచినీటి బోరు పనులకు శంకుస్థాపన





**జంగారెడ్డిగూడెం:జూన్ 14(ప్రజా వీక్షణం)**

మండల పరిధిలోని పుట్లగట్లగూడెం గ్రామ పంచాయతీలో ఎదురవుతున్న మంచినీటి సమస్య పరిష్కారానికి కూటమి నాయకులు శ్రీకారం చుట్టారు. ఆదివారం గ్రామంలో పర్యటించిన జనసేన, టీడీపీ (కూటమి) నాయకులు రూ. లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన మంచినీటి బోరుబావి నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి ఘనంగా శంకుస్థాపన చేశారు.


### సమస్యల పరిష్కారమే ధ్యేయం

శంకుస్థాపన అనంతరం కూటమి నాయకులు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ, అంతర్గత రహదారులు, వీధి దీపాల వంటి పలు ప్రజా సమస్యలపై స్థానికులతో చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని, ప్రజల ప్రాథమిక సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామానికి మరో ప్రత్యేక ఆకర్షణ నిలిచింది. పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన విద్యార్థి వాముశెట్టి సీతారామస్వామి ప్రతిష్టాత్మక ఒంగోలు ××ం లో సీటు సాధించడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి పేరు తెచ్చిన విద్యార్థిని కూటమి నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో:పోల్నాటి బాబ్జి (జడ్పీటీసీ, జనసేన నాయకులు)కుక్కల మాధవరావు (టీడీపీ మండల అధ్యక్షులు)శీలం వెంకటరాజు (టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు)పారేపల్లి మణి బాబు (గురవాయిగూడెం సొసైటీ అధ్యక్షులు)శీలం రామచంద్ర రావు (మాజీ జెడ్పీటీసీ)శీలం కృష్ణంరాజు (9 అధ్యక్షులు)ప్రగడ సత్తిబాబు (జనసేన నాయకులు)వీరితో పాటు గ్రామానికి చెందిన పలువురు కూటమి కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గొట్టిపాటి రామకృష్ణ మనవరాలి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, బోడే ప్రసాద్

**విజయవాడ, జూన్ 14 (ప్రజావీక్షణం):**

తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు గొట్టిపాటి రామకృష్ణ మనవరాలి పుట్టిన రోజు వేడుకలు విజయవాడలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు పలువురు ప్రముఖ రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై సందడి చేశారు.పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్ ఈ శుభ కార్యానికి విచ్చేసి, జన్మదినం జరుపుకుంటున్న చిన్నారిని ఆత్మీయంగా ఆశీర్వదించారు. చిన్నారికి భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు. వారితో పాటు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, పలువురు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య నేతలు ఈ వేడుకల్లో పాల్గొని గొట్టిపాటి రామకృష్ణ కుటుంబ సభ్యులకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేడుకకు విచ్చేసిన అతిథులకు గొట్టిపాటి రామకృష్ణ ఘన స్వాగతం పలికారు.



# కోన ప్రీమియర్ లీగ్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**బాపట్ల : జూన్ 14 ( ప్రజా వీక్షణం )**

బాపట్ల జిల్లా బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలం ప్యార్లీ గ్రామంలో నిర్వహిస్తున్న కోన ప్రీమియర్ లీగ్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను ఆదివారం మాజీ ఉప సభాపతి,బాపట్ల మాజీ శాసనసభ్యులు కోన రఘుపతి ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.....యువత క్రీడలను అలవర్చుకుని శారీరకంగా, మానసికంగా దృడంగా ఎదగాలని సూచించారు.క్రీడలు క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపోందిస్తాయని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా యువ క్రీడాకారుల ప్రతిభ వెలుగు లోకి వస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు ,క్రీడాకారులు,యువకులు,అభిమానులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.




# విద్యుత్ కార్మికుల ఆశాజ్యోతి బాల కాశీకి జన్మదిన శుభాకాంక్షలు

## జంగారెడ్డిగూడెం డివిజన్ నాయకులు సత్యనారాయణ

**జంగారెడ్డిగూడెం:జూన్ 14(ప్రజా వీక్షణం)**

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల కాశీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం డివిజన్ ప్రతినిధి సత్యనారాయణ ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ... బాల కాశీ నిరంతరం కార్మికుల పక్షాన నిలబడి పోరాడే నిప్పులాంటి నాయకుడని కొనియాడారు.నిరంతరం విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి న్యాయమైన డిమాండ్ల సాధనకు అలుపెరుగని పోరాటం చేస్తున్న వీరుడు బాల కాశీ. నీతికి, నిజాయితీకి, పట్టుదలకు ఆయన మారుపేరుగా నిలిచారని జంగారెడ్డిగూడెం డివిజన్ సత్యనారాయణ తెలిపారు.కార్మిక లోకానికి ఆయన అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అలాగే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని సత్యనారాయణ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మిక సంఘాల నాయకులు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొని బాల కాశీకి శుభాకాంక్షల వెల్లువ కురిపించారు.



# కూటమి రెండేళ్ల విజయోత్సవం 16న ఏలూరులో జిల్లా బహిరంగ సభ

## నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలి

## ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పిలుపు

## ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఉదయం 10:30 గంటలకు ప్రారంభం

**పోలవరం, జూన్ 14 (ప్రజా వీక్షణం):**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 16వ తేదీ (మంగళవారం) ఏలూరులో భారీ జిల్లా స్థాయి బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని ఇండోర్ స్టేడియంలో ఉదయం 10:30 గంటలకు ఈ విజయోత్సవ సభ ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, కూటమి అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పిలుపునిచ్చారు.



### అలాగే సంక్షేమ ప్రగతిని వివరించేందుకే..

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలు, ప్రజల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకే ఈ సభను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర, జిల్లా పార్టీ కార్యాలయాల ప్రతినిధులు తెలిపారు. సభ ఏర్పాట్లపై జిల్లా టీడీపీ అధ్యక్షులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ రెండేళ్ల ప్రగతి పండుగకు పార్టీ శ్రేణులన్నీ ఏకతాటిపైకి రావాలని కోరారు. నియోజకవర్గాల వారీగా నాయకులు, కార్యకర్తలు సమయానికి సభకు చేరుకుని, ఈ విజయోత్సవాన్ని గ్రాండ్ సక్సెస్ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు అమీనాపేటలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం నుండి ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు.

# రక్తదానం మహాదానం

## ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి

## ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదాతలకు ఘన అభినందనలు

**పోలవరం, జూన్ 14 (ప్రజా వీక్షణం):**

నిస్వార్థంగా రక్తదానం చేస్తూ ఎందరో ప్రాణాలను కాపాడుతున్న రక్తదాతల సేవలు అమూల్యమైనవని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి కొనియాడారు. జూన్ 14న నిర్వహించే 'ప్రపంచ రక్తదాతల దినోత్సవం' సందర్భంగా ఆమె రక్తదాతలందరికీ హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తదానం అనేది అన్ని దానాల్లో కల్లా మహాదానమని, ఒకరు చేసే రక్తదానం మరొకరి జీవితానికి ప్రాణదానంగా మారుతుందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో, ప్రాణాపాయంలో ఉన్న రోగులకు సమయానికి రక్తం అందించి కాపాడుతున్న దాతల చొరవ అభినందనీయమన్నారు.రక్తదానం ద్వారా మానవత్వాన్ని చాటుతున్న ప్రతి ఒక్కరికీ సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది. ప్రతి ఆరోగ్యవంతుడైన వ్యక్తి క్రమం తప్పకుండా రక్తదానం చేయాలని కొవ్వాసు జగదీశ్వరి, డైరెక్టర్, ఏపీ స్పోర్ట్స్ అథారిటీ తెలిపారు. అలాగే సమాజంలో రక్తదానం పట్ల ఇంకా విస్తృతంగా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని జగదీశ్వరి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదాన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రాణాలను కాపాడే ఈ గొప్ప సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె ఆకాంక్షించారు.




# ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 14 (ప్రజా వీక్షణం న్యూస్)**


హనుమకొండలో ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భం గా ప్రభుత్వ ప్రసూతి ఆసు పత్రి ఆధ్వర్యంలో నిర్వ హించిన ర్యాలీని డీఎంహెచ్ ఓ డాక్టర్ ఎస్.డి. రాం కుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి ప్రారంభించారు. రక్తదానం ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచి, స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వచ్చేలా కృషి చేయాలని డీఎంహెచ్ఓ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, విద్యార్థులు రక్తదానంపై అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేసి, 49 సార్లు రక్తదానం చేసిన హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి ఎస్ శ్రీనివాస్‌ను ప్రత్యేకంగా అభినందించారు.



# స్టేట్ ర్యాంక్ విద్యార్థిని సన్మానించిన అంబేద్కర్ సంఘం సభ్యులు..

**దేవరకద్ర జూన్ 14 ప్రజావిక్షణం**

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కి చెందిన అంబేద్కర్ సంఘం సభ్యులు ప్రధాన కార్యదర్శి. డబ్బా రాములు .కుమారుడు కిరణ్ కుమార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం. ఫలితాలలో స్టేట్ ర్యాంక్ రావడంతో. ఆదివారం నాడు అంబేద్కర్ సంఘం సభ్యులు కలిసి విద్యార్థిని. శాలువతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో.సదానంద్ జి.ఎల్లస్వామి .బాలు. కండక్టర్ చిన్న నరసింహులు. అంబేద్కర్. జయరాజు. మెకానిక్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనది..- ఎమ్మెల్యే జిఎంఆర్





దేవరకద్ర జూన్ 14 ప్రజా విక్షణం

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని దానిని ప్రతి ఒక్కరు కూడా సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారము దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో ఆర్ కే మినీ ఫంక్షన్ హాల్ లో ఎస్ ఐ ఆర్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' అవగాహన--శిక్షణ శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బూత్ లెవెల్ ఏజెంట్లు బి ఎల్ ఏ లు బాధ్యతాయుతంగా పనిచేయాలనిఆయన పిలుపునిచ్చారు.ఎస్ ఐ ఆర్ ను ఎవరు తేలికగా తీసుకోవద్దని, ఇప్పటి వరకు ఓట్లు వేసాం కదా అని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రేపు మన ఓటే జాబితాలో లేకుండా చేసే ప్రమాదం ఉంది అనిఆయన హెచ్చరించారు. పలు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల పేరుతో జరిగిన అవకతవకల కారణంగా ముఖ్యమంత్రులుగా పనిచేసిన నాయకులే తమ సొంత నియోజకవర్గాల్లో ఓడిపోయిన పరిస్థితులు ఏర్పడ్డాయనిఆయన తెలిపారు. ఎస్ ఐ ఆర్ సందర్భంగా ప్రతి బి ఎల్ ఏ ఓటు హక్కు పరిరక్షణ కోసం సైనికుడిలా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.రాహుల్ గాంధీ, దేశవ్యాప్తంగా ఓటు చోరీ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత లేకపోవడం పై చేస్తున్న పోరాటం కేవలం కాంగ్రెస్ పార్టీ కోసమే కాదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమని ఆయన అన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతని పేర్కొన్నారు, బి ఎల్ ఎ లు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాలను పరిశీలించాలని, కొత్త ఓటర్ల నమోదు, మారిన చిరునామాల సవరణ, తొలగించబడిన పేర్ల గుర్తింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలనిఆయన సూచించారు. ఓటర్ల జాబితానే ఎన్నికల్లో విజయానికి తొలి అడుగని, బూత్ బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఎస్ ఐ ఆర్ ద్వారా బీజేపీ చేస్తున్న కుట్రలను క్షేత్రస్థాయిలోనే తిప్పికొట్టి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.ఈ శిక్షణా తరగతులలో బి.ఎల్.ఎ ట్రైనర్ అమరేందర్ రెడ్డి , టీపీసీసీ కోఆర్డినేటర్ పృథ్వి చౌదరి, పాల్గొని, ఏజెంట్లకు సాంకేతిక, క్షేత్రస్థాయి విధివిధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రమైన శిక్షణ మరియు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ , టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి , టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ లు, వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్లు, మార్కెట్ యార్డ్ ల చైర్మన్లు, బి.ఎల్ ఏ లు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తాం..ఎమ్మెల్యే జిఎంఆర్

దేవరకద్ర జూన్ 14 ప్రజావి క్షణం

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తామని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారము దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వాయ్ 2 న్యూస్ ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ దేవరకద్ర ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొని, ఆయన నియోజకవర్గ ప్రజల ఫోన్ కాల్స్ కు ఆన్సర్ చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యేజి. మధుసూదన్ రెడ్డి , ఈ సందర్భంగా ప్రజల ఫోన్ కాల్స్ కు ఓపికగా సమాధానం ఇచ్చి, పలువురి సమస్యలపై అప్పటి కప్పుడు పరిష్కారం చూయించి, పలువురి సమస్యలను నోట్ చేసుకుని వారి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.




## చేగుంటపల్లిలో ఘనంగా గన్ మన్ పోసిబాబు కుమార్తె పుట్టినరోజు వేడుకలు

పోలవరం, జూన్ 14: (ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, చేగుంటపల్లి గ్రామంలో గన్ మన్ పోసిబాబు కుమార్తె పుట్టినరోజు వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు హాజరై చిన్నారికి ఆశీస్సులు అందించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ వేడుకల్లో పోలవరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మరియు నియోజకవర్గ ఇన్చార్జ్ తెల్లం బాలరాజు ముఖ్య అతిథిగా పాల్గొని సందడి చేశారు. ఆయనతో పాటు ఈ కార్యక్రమానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు భీమవరం నియోజకవర్గ పరిశీలకులు మంతెన సోమ రాజు , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంట శ్రీను , కొయ్యల గూడెం మండల ఎంపీపీ గంజిమల రామారావు మరియు పోలవరం మండల పార్టీ ప్రెసిడెంట్ బుగ్గ మురళీకృష్ణ, రవివైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టౌన్ వైస్ ప్రెసిడెంట్, కొయ్యలగూడెం హాజరయ్యారు.అలాగే నాయకులందరూ చిన్నారికి బహుమతులు అందించి, భవిష్యత్తులో మంచి ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆకాం క్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, గ్రామస్తులు, మరియు సన్నిహితులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను జయప్రదం చేశారు.



# మీ ప్రేమాభిమానాలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటా

### వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన ప్రదర్శనను విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు

### ఐదే ఉత్సాహంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైకాపా అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

### వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం

తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 14 (ప్రజా వీక్షణం)




వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు తాడేపల్లిగూడెం పట్టణంలో నిర్వహించిన వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమాన్ని, బైక్ ర్యాలీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు చెప్పారు. స్థానిక సవిత్రుపేటలోని వైకాపా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం గ్రామీణ మండలం, పట్టణం, పెంటపాడు మండలాల నుంచి పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొనటం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చెయ్యకుండా మోసం చేసినకూటమి ప్రభుత్వంపై ఎంతో వ్యతిరేకత ఉందన్నారు. ఈ నిరసన కార్యక్రమం ద్వారా రైతులకు ఇచ్చిన హామీ ఏమిటి, రైతులకు ఇచ్చిందేమిటి, ఆడబిడ్డ నిది పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ 1500 చొప్పున ఇస్తామని హామీనిచ్చి, ఈ రెండేళ్లలో రాష్ట్రంలోని ఎంతమంది మహిళలకు ఎన్ని కోట్ల నిధులిచ్చారు, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇచ్చారా, ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు చొప్పున ఐదేళ్లలో 20 లక్షలు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారని, ఈ రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలిచ్చారో చెప్పాలని కూటమి ప్రభుత్వాన్ని, నాయకులను నిలదీశామని చెప్పారు. చంద్రబాబు నాయుడు మాటలను రాష్ట్ర ప్రజానీకం ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ చేపట్టిన నిరసన ప్రదర్శన, బైక్ ర్యాలీకి ఒక్కసారిగా తాడేపల్లిగూడెం ఉలిక్కిపడిందని చెప్పారు. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా, తన పిలుపును గౌరవించి నిరసన, బైక్ ర్యాలీలో అడుగులో అడుగు వేసిన ప్రతి కార్యకర్తకు తానెప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. కార్యకర్తల అభిమానం, ఆదరణ, పోరాట స్ఫూర్తే ఈ కార్యక్రమ విజయానికి బలమని తెలిపారు. తన పిలుపును గౌరవించి కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ, నాయకులు, కార్యకర్తల ప్రేమాభిమానాలకు తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. ఇదే ఉత్సాహంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని వివరించారు.

## బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరికలు..

దేవరకద్ర జూన్ 14 ప్రజా వీక్షణం

దేవరకద్ర నియోజకవర్గం చిన్న చింత కుంట మండల పరిధిలోని ఫర్దిపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కుర్వ అంజి,కుర్వ తిరుపతి,కుర్వ మల్లేష్,కుర్వ శివ,కుర్వ లక్ష్మణ్, కుర్వ శివరాజు మరియు తదితరులు పెద్ద ఎత్తున ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యేజి. మధుసూదన్ రెడ్డి, సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు, ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఎమ్మెల్యే జియంఆర్ ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జిఎంఆర్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరామని పేర్కొన్నారు.







## ప్రధాన కార్యదర్శి గరిగె శ్రీనివాస్‌కు సన్మానం



ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 14 (ప్రజా వీక్షణం న్యూస్)

ఇటీవల జరిగిన హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండల మీడియా పాయింట్ ఎన్నిక ల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గరిగె శ్రీనివాస్‌ను 66వ డివిజన్ హసన్‌పర్తి గణేష్ నగర్‌కు చెందిన శ్రీరామ (అయోధ్య) మిత్ర మండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మిత్ర మండలి సభ్యులు గరిగె శ్రీనివాస్‌కు శాలువా కప్పి అభినందనలు తెలియజేస్తూ, ఆయన పదవీకాలంలో మీడియా రంగానికి మరింత సేవలం దించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ (అయోధ్య) మిత్ర మండలి అధ్యక్షుడు దాది మధుసూద న్, కోశాధికారి బెనికి సురేష్, సభ్యులు శనిగరపు కామేశ్వర్ రెడ్డి, దాది రాజు, గరిగె రాజు, గరిగె రాజ్ కుమార్, తోట రాకేష్, కోటి, వీరన్న, కోటేశ్వర్లు, సురేందర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
15 సోమవారం, జూన్ 2026
5
www.prajaveekshanam.in

## తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మల్లు బట్టి విక్రమార్కను సన్మానించిన మాజీ డీసీసీ అధ్యక్షులు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే..

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 14 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు స్వగృహములో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా కలిసి శాలువ తో సన్మానించి, ఆసిఫాబాద్ నియోజకవర్గము లోని సాగు నీటి ప్రాజెక్ట్ ల మరమ్మత్తులు మరియు కాలువలు పూర్తి చేయాలని ,అసంపూర్తి బ్రిడ్జి లను పూర్తి చేయాలని,మారుమూల గ్రామాలకు బీటి రోడ్లు, బ్రిడ్జిలు మంజూరు చేయాలని,నూతనంగా ఏర్పడిన ఆసిఫాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సింగరేణి ప్రభావిత గ్రామాల అభివృద్ధికి డి ఎమ్ ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులు మంజూరు చేయాలని,ఆసిఫాబాద్ నియోజకవర్గము లోని 242 గ్రామ పంచాయతీల గ్రామాల మౌళిక వసతుల కొరకు ఎస్ డి ఎఫ్ నిధులు మంజూరు చేయాలనీ,ఉషగాం లో నివసిస్తున్న హోజా తెగ వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని,గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, నూతనంగా విధ్యుత్ సబ్ స్టేషన్ లు మంజూరు చేయాలని వినతి పత్రము సమర్పించిన ఆసిఫాబాద్ కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు,మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు దాదా మరియు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## మోదుగగుంట గ్రామ మాజీ సర్పంచ్, బీసీ నాయకుడు ఏపూరి వెంకన్న మృతి బీసీ సంఘానికి తీరని లోటు

తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 14 (ప్రజా వీక్షణం)

తాడేపల్లిగూడెం మండలంలోని మోదుగగుంట గ్రామ మాజీ సర్పంచ్, బీసీ నాయకుడు ఏపూరి వెంకన్న మృతి బీసీ సంఘానికి తీరని లోటని, ఆయన మృతి తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, తెదేపా సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ పోతుల అన్నవరం, బీసీ నాయకులు కేశవభట్ల విజయ్ పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ గా వెంకన్న18 సంవత్సరాలు సేవలు అందించటంతోపాటు గ్రామ అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ప్రజలు, బీసీ నాయకుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేసిన వెంకన్నగ్రామ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని, ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. వెంకన్న మృతి పట్ల తీవ్రసంతాపం వ్యక్తం చేస్తూ ఆయన కుమారుడు గ్రామ మాజీ సర్పంచ్ ఏపూరి సత్యనారాయణ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ముందుగా వెంకన్న చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుల్లపల్లి కొండరాజు, ఏపూరి నాగరాజు, చిటికెన తిరుపతిరావు కామన గణపతి,చిల్లుమంతల వెంకటేశులు, కామన శ్రీను. మిండేలి బుల్లయ్య దండ్రు బుచ్చయ్య ఏపూరి కొండరాజు తదితరులు పాల్గొన్నారు.





## ధర్మాజీగూడెంలో పేకాట తావులపై పోలీసుల దాడి: పది మంది అరెస్ట్

ధర్మాజీగూడెం (లింగపాలెం):జూన్ 14(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న ఒక పేకాట స్థావరంపై శనివారం పోలీసులు అకస్మిక దాడి (రైడ్) చేశారు. ఈ దాడిలో పది మందిని అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) వెంకన్న తెలిపారు.పోలీసుల కథనం ప్రకారం:ధర్మాజీగూడెం పరిధిలోని తాతగారు కాలనీలో కొంతమంది వ్యక్తులు గుంపుగా చేరి బహిరంగంగా పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం పోలీసులకు అందింది. ఈ మేరకు ఎస్ఐ వెంకన్న తన సిబ్బందితో కలిసి సదరు ప్రాంతంపై మెరుపు దాడి నిర్వహించారు.ఈ దాడిలో పేకాట ఆడుతూ పట్టుబడిన పది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 10,200/- నగదుతో పాటు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.గ్రామాల్లో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదు. జూద క్రీడలపై మా నిఘా నిరంతరం కొనసాగుతుందని సబ్ ఇన్స్పెక్టర్ ధర్మాజీగూడెం వెంకన్న తెలిపారు అలాగే చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెల్లడించారు. గ్రామాల్లో ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు.



## చింతలపూడిలో ఆధునిక హంగులతో ఆర్టీసీ బస్టాండ్

### ప్రారంభించిన ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్





చింతలపూడి, జూన్ 14:(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని స్థానిక శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కొత్త బస్టాండ్‌లో రూ. 30 లక్షల వ్యయంతో చేపట్టిన పలు ఆధునీకరణ పనులు పూర్తి కావడంతో, ఆదివారం ఆయన వాటిని ఘనంగా ప్రారంభించారు.రిబ్బన్ కత్తిరించి ఆధునీకరించిన బస్టాండ్‌ను ప్రయాణికులకు అంకితం చేసిన అనంతరం, ఎమ్మెల్యే బస్టాండ్ ఆవరణలో కల్పించిన కొత్త వసతులను స్వయంగా పరిశీలించారు.

#### కూటమి ప్రభుత్వంతోనే నియోజకవర్గ అభివృద్ధి

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు.చింతలపూడి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని దశలవారీగా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరింత నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా కృషి చేయాలని సొంగా రోషన్ కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే తెలిపారు.అలాగే చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న బస్టాండ్ ఆధునీకరణ పనులను రూ. 30 లక్షల నిధులతో పూర్తి చేయడంతో స్థానిక ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల వెయిటింగ్ హాళ్లు, తాగునీటి వసతి, విద్యుద్దీకరణ, ఇతర మౌలిక వసతులను ఈ నిధులతో మెరుగుపరిచారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి స్థానిక డిపో మేనేజర్, ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వారితో పాటు కూటమి పార్టీల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్‌ఐటి ఏర్పాటుతో సాంకేతిక విద్య పట్ల పెరిగిన ఆసక్తి

### బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి

తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 14 (ప్రజా వీక్షణం)




కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం విభజిత ఆంధ్రప్రదేశ్ కు మంజూరు చేసిన 18 జాతీయస్థాయి సంస్థలను రాష్ట్రంలో ఎర్పాటుచేశారని బిజెపి రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి అన్నారు. దేశంలో ప్రతిష్టాకరమైన జాతీయ సాంకేతిక విద్యాసంస్థ (ఎన్ ఐ టి -ఎ పి )ని తాడేపల్లిగూడెం లో ఎర్పాటుచేయటం పశ్చిమగోదావరి జిల్లాకే గర్వకారణమని చెప్పారు. ఎన్ఐటి విద్యాసంస్థ ఏర్పాటుతో జిల్లాలోనూ పరిసర ప్రాంతాల్లోను సాంకేతిక ఉన్నత విద్య పట్ల యువతలో ఆసక్తి మరింత పెరిగిందని వివరించారు. బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు ప్రాజెక్టుల సందర్భంలో భాగంగా ఎస్సి మోర్చ జిల్లా అధ్యక్షులు గోపే సుందరరావు, నాయకులు ఆదివారం తాడేపల్లిగూడెం పట్టణంలోని ఎన్ ఐ టి ప్రాంగణాన్ని సందర్శించడం జరిగింది. బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాకరమైన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ని తాడేపల్లిగూడెంలో నెలకొల్పడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని చెప్పారు. ఆధునిక సాంకేతిక విద్యాపరమైన కోర్సులను ఎన్ఐటీలో ప్రవేశ పెట్టడం ద్వారా ఎంతోమంది సాంకేతిక నిపుణులను తయారుచేసి దేశానికి అందించడం జరిగిందని చెప్పారు. ఈ సంస్థలను మంజూరు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు ఎలియజేశారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు గోపె సుందర రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెదపోలు వీరరాఘవులు, కోట రాంబాబు, బిజెపి పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను, ఎస్సి మోర్చా జిల్లా నాయకులు వి ఆర్ వి ఎల్ నారాయణ,బిజెపి ప్రధాన కార్యదర్శులు చిట్యాల రాంబాబు, కావ్యరెడ్డి, పాటే నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## కిట్స్ వరంగల్‌కు గవర్నర్ రక్తదాత ప్రేరేపక అవార్డు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 14 (ప్రజా వీక్షణం న్యూస్)



వరంగల్‌కు చెందిన కిట్స్ ఎన్‌ఎస్‌ఎస్ బృందం 2025- 26 విద్యా సంవత్సరంలో అత్యధిక యూనిట్ల రక్త దానం చేయించి రాష్ట్రస్థాయి గవర్నర్ రక్తదాత ప్రేరేపక అవార్డు అందుకుంది. ప్రపంచ రక్తదాతల దినోత్స వం సందర్భంగాహైదరాబాద్ రాజ్‌భవన్‌లో శివ్ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. సిహెచ్. సతీష్ చంద్ర ఈ అవార్డును స్వీకరించారు. కిట్స్ వరంగల్ ఎన్‌ఎస్‌ఎస్ బృందం వరుసగా మూడో ఏడాది (2023-24, 2024-25, 2025-26) ఈ గౌరవాన్ని దక్కించుకోవడం విశేషం. ఈ సందర్భంగా కళాశాల యాజ మాన్యం, అధ్యాపకులు, విద్యార్థి బృందాన్ని అభినందించారు.

# కార్యకర్తల అండతోనే ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ పోరాటం





ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 14

(ప్రజా వీక్షణం న్యూస్)

తెలంగాణ ప్రజల సమస్యల పై పార్టీ కార్యకర్తల అండ దండలతోనే బీఆర్ఎస్ ప్రజా క్షేత్రంలో పోరాటం కొనసాగి స్తోందని మాజీ మంత్రి, సిద్ది పేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. హన్మకొండ బాలసముద్రం లోని బీఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకుడు దుగ్గంపూడి రంజిత్ రెడ్డి జన్మదినం సందర్భంగా నిర్వహించిన “ఎంపవర్ ఏ చైల్డ్” కార్యక్రమంలో హరీష్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో చదువుతున్న 500 మంది పేద విద్యార్థులకు స్కూల్ ఫీజు చెక్కులు, బ్యాగులు పంపిణీ చేశారు. హరీష్ రావు మాట్లాడుతూ రంజిత్ రెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్ కలిసి పేద విద్యార్థు ల విద్యాభివృద్ధికి చేయూత నివ్వడం అభినందనీయమ న్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ హయాంలో అమలైన సంక్షే మ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో మేలు చేశా యని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అంతిమ లక్ష్యం ప్రజా శ్రేయస్సేనని, అధికారంలో ఉన్నా ప్రతి పక్షంలో ఉన్నా ప్రజల కోసమే పోరాడుతామని అన్నారు. పార్టీ కార్యాలయం ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా మారిందని తెలిపా రు. బీఆర్ఎస్ నాయకుడు దుగ్గంపూడి రంజిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్స రం తన జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ కార్యకర్తలు తన కుటుంబ సభ్యుల్లాంటి వారని, వారి సహకారంతోనే ఈ కార్య క్రమాలు నిర్వహిస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, ఆరూరి రమేష్, మర్రి యాదవ రెడ్డి, జోరిక రమేష్, నరెడ్ల శ్రీధర్, చుంచు రమేష్ వర్మ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు చలకాని వెంకట్ యాదవ్‌కు ఘన సన్మానం

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 14 (ప్రజా వీక్షణం న్యూస్)



తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా వరుసగా రెండోసారి ఎన్నికైన చలకాని వెంకట్ యాదవ్‌ను ఆదివారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో నిర్వహించిన విజ యోత్సవ సభలో ఘనంగా సత్కరించారు. ఈ కార్య క్రమంలో తొర్రూర్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్య వర్గ సభ్యులతో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొని చలకాని వెంకట్ యాదవ్‌కు అనందనలు తెలియ జేశారు. న్యాయ వాదుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం ఆయన మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో తొర్రూర్ బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు వీరదాసు వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి తణుకు నూరి సైదులు, సీనియర్ న్యాయవాదులు కల్వకొలను ప్రవీణ్ రాజు, వల్లపు మధుసూదన్, వల్లపు మహేష్, ఐలోని, మైలపాక అశోక్, బాసరబోయిన చంద్రయ్య, తలారి యాకాం బరం, పెరుమాండ్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాపూర్‌లో 405వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమం

### గంగిరెద్దుల కాలనీలో విస్తృత పారిశుద్ధ్య చర్యలు

తూప్రాన్, జూన్ 14. ప్రజావీక్షణం ప్రతినిధి:

తూప్రాన్ మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 405వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆదివారం 6వ వార్డులోని గంగిరెద్దుల కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అలాగే సీసీ రోడ్లను చీపుర్లతో ఊడ్చి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్నం దున గ్రామస్తులు తమ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాన్ని నిరంతరం స్వచ్ఛంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పంచాయతీ పాలకవర్గం, మెకిన్ యువత కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కృష్ణ, తిరుపతి, కృష్ణ ముదిరాజ్, రేఖ నాగరాజు గౌడ్, మాధవి స్వామి, మత్స్యశాఖ మాజీ చైర్మన్ పాప నరసింహులు, మెకిన్ యువత, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.





## అమ్మవారిని దర్శించుకున్న కిరాణం అసోసియేషన్ సభ్యులు..

దేవరకద్ర జూన్ 14 ప్రజా వీక్షణం

నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలంలో ఉన్న బిజ్వార్లో ఉన్న అంబత్రాయ క్షేత్రాన్ని అక్కడ ఉన్న అమ్మవారి ని ఆదివారము దేవరకద్ర మండల కిరాణం అసోసియేషన్ సభ్యులు దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో కన్నయ్య, నాగులు, గిరిశంకర్,సత్యం,కిషోర్, రఘు, సదానంద్, హరి కాంతు, శ్రీనివాసులు, హరి, నరేష్, ఈశ్వర్, నాగయ్య శెట్టి, వెంకటేష్, మహేషు, వెంకటేష్, రఘు, రమణ, తదితరులు పాల్గొన్నారు.






## సింగరేణిపై హరీశ్ రావు లెక్కలకు సిద్ధమా: భట్టి....

తెలంగాణ జూన్ 14 ప్రజావీక్షణం

సింగరేణి సంస్థ విషయంలో బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు లెక్కలకు సిద్ధమా అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సవాల్ చేశారు. శనివారం మంచిర్యాలలో ఆయన మాట్లాడుతూ, దేశంలో ఒక్క బీఆర్ఎస్ మాత్రమే సింగరేణిని మోసం చేసిందని ధ్వజమెత్తారు. రోజుకొక అబద్దాలతో బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ హయాంలో సింగరేణిని దోపిడీకి గురిచేశారని ఆరోపించారు.



## చందు గౌడ్ కూతుర్ని ఆశీర్వదించినఎస్ఐ నాగన్న...


దేవరకద్ర జూన్ 14 ప్రజావీక్షణం

మండల పరిధిలోని కోయిల్ సాగర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ యూత్ సీనియర్ నాయకులు చందు గౌడ్ కూతురు అక్షిత ఫంక్షన్ కు రాలేకపోయినందుకు ఆదివారం భూత్పూర్ ఎస్ఐ నాగన్న అక్షిత ను ఆశీర్వదించారు. తదుపరి కుటుంబ సభ్యులు ఎస్సై కి శాలువా తో ఘనంగా సన్మానం చేశారు.



## ఒంగోలు ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన గురుకుల పాఠశాల విద్యార్థి మనోజ్ కుమార్

తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 14 (ప్రజా వీక్షణం)




తాడేపల్లి గూడెం మండలం పెదతాడేపల్లి లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి పి.మనోజ్ కుమార్ ఒంగోలు ట్రిబుల్ ఐటీలో సీటు సాధిం చాడు. ఈ సందర్భంగా విద్యార్థి మనోజ్ కు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, డీఈఓ నారాయణ, డీసీఓ ఎన్. భారతి, సమగ్ర శిక్ష ఏపీసీ పి.శ్యామ్ సుందర్, పాఠ శాల ప్రిన్సిపాల్ బి.రాజారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రతాప్, ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. విద్యార్థి కృషి, పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శ కత్వం ఫలితంగానే ఈ విజయాన్ని సాధిం చాడని ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి సంస్థకు, జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. పాఠశాల సిబ్బంది, విద్యా ర్థులు మనోజ్ కుమార్‌ను అభినందించి, ఆయన విజయాన్ని ఆదర్శంగా తీసుకుని తోటి విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని వారు వివరించారు.


## కూటమి రెండేళ్ల పాలన :

### 16న ఏలూరులో భారీ జిల్లా బహిరంగ సభ

### విజయవంతం చేయాలని పోలవరం టీడీపీ ఇంచార్జ్ బొరగం శ్రీనివాసులు పిలుపు

పోలవరం, జూన్ 14:(ప్రజా వీక్షణం)





ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 16వ తేదీన (మంగళవారం) ఏలూరులో భారీ “జిల్లా బహిరంగ సభ” నిర్వహించ నున్నట్లు పోలవరం నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ మరియు ఆంధ్ర ప్రదేశ్ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీని వాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వ సారథ్యంలో చేపట్ట బోయే ఈ ప్రతిష్టాత్మక సభకు సంబం ధించిన వివరాలను ఆయన ఆదివారం పోల వరం నియోజకవర్గ టీడీపీ కార్యా లయం నుండి మీడియాకు విడుదల చేశారు.ఈ సందర్భంగా బొరగం శ్రీని వాసులు మాట్లాడుతూ.. రెండేళ్ల కూటమి ప్రభుత్వ ప్రజారంజక పాలన, సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలవరం నియోజకవర్గం లోని తెలుగు దేశం పార్టీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ భారీ సంఖ్యలో తరలి వచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సభ వివరాలు:

సమావేశ ప్రాంగణం : ఇండోర్ స్టేడియం, కలెక్టరేట్ దగ్గర, ఏలూరు.

తేదీ: 16-06-2026 (మంగళవారం)

సమయం: ఉదయం 10:30 గంటలకునియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుండి నాయకులు, కార్యకర్తలు ఉదయాన్నే నిర్ణీత సమయానికి సభా స్థలికి చేరుకోవాలని, సమన్వయంతో సభను గ్రాండ్ సక్సెస్ చేయాలని ఆయన కోరారు.

## దివంగత ఎమ్మెల్యే తంగిరాల ప్రభాకర్ రావు వర్ధంతి: నేడు నందిగామ నియోజకవర్గంలో విగ్రహాల ఆవిష్కరణ

-ముఖ్య అతిథులుగా హాజరుకానున్న ఎంపీ కేశినేని చిన్ని, మాజీ మంత్రి దేవినేని ఉమా

-హాజరుకావాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ, జూన్ 14 (ప్రజావిక్షణం న్యూస్):**

నందిగామ నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు, కీర్తిశేషులు తంగిరాల ప్రభాకర్ రావు వర్ధంతి కార్యక్రమాలను నియోజక వర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించ నున్నారు. ప్రస్తుత నందిగామ శాసనసభ్యు రాలు తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమాల్లో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని), మాజీ మంత్రివర్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో దివంగత నేత ప్రభాకర్ రావు నూతన విగ్రహాలను ఆవిష్కరించి, ఆయన సేవలను స్మరించుకోనున్నారు. పర్యటన మరియు కార్యక్రమాల పూర్తి వివరాలు:ప్రకారం..
కంచికచర్ల టౌన్: ఉదయం కంచికచర్ల పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన తంగిరాల ప్రభాకర్ రావు విగ్రహాన్ని ఎంపీ కేశినేని చిన్ని, దేవినేని ఉమాతో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆవిష్కరిస్తారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పిస్తారు. కీసర గ్రామం: కంచికచర్ల అనంతరం కీసర గ్రామానికి చేరుకుని, అక్కడ నూతనంగా ప్రతిష్టించిన తంగిరాల ప్రభాకర్ రావు విగ్రహాన్ని ఆవిష్కరించి, నివాళులు అర్పిస్తారు. అనంతరం నందిగామ పట్టణంలోని మధిర ఆర్చి రోడ్డులో ఉన్న తంగిరాల ప్రభాకర్ రావు ఘాట్‌ను నేతలు సందర్శిస్తారు. అక్కడ ఆయనకు ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం, వర్ధంతి సందర్భంగా ఘాట్ ఆవరణలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రజాప్రతినిధులు ప్రారంభించి, సందర్శిస్తారు. నియోజకవర్గ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన దివంగత నేత తంగిరాల ప్రభాకర్ రావు వర్ధంతి కార్యక్రమాలకు కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానులు మరియు పార్టీ సానుభూతిపరులు అందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కోరారు.

## పి ఆర్ సిని వెంటనే ప్రకటించాలి

-లేకుంటే ప్రతిఘటన తప్పదు -పాఠశాలల కుదింపు ఆలోచనలు విరమించుకోవాలి

-ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి-టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్






**భద్రాద్రి కొత్తగూడెం,జూన్14(ప్రజావీక్షణం):**

పి ఆర్ సిని వెంటనే ప్రకటించాలని లేకుంటే ఉద్యమం తప్పదని అంతేకాకుండా పాఠశాలల కుదింపు ఆలోచనలు విరమించుకోవాలని ప్రభుత్వ పాఠ శాలలను బలోపేతం చేయాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెంలోని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యాలయం టీచర్స్ భవన్ నందు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టిఎస్ యుటిఎఫ్) జిల్లా విస్తృత కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు బి.మురళీ మోహన్ అధ్యక్షతనజరిగింది. ఈ సమా వేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వం 27,000 ప్రభుత్వ పాఠశాలలను 4000 పాఠ శాలలుగా కుదించాలనే ఆలోచన విరమించు కోవాలని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధంగా తగుచర్యలు తీసుకోవాలని మొదటి దశలో ప్రతి గ్రామ పంచాయతీలో ఒక పాఠశాలను ఆదర్శ పాఠశాలగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. నర్సరీ కేజీ తరగతులను ప్రవేశపెట్టి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంచడం కొరకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే పాఠ్యపుస్తకాలు వర్క్ బుక్కులు నోటు పుస్తకాలు యూనిఫామ్స్ పాఠశాలలకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని పర్యవేక్షణ పోస్టులను వెంటనే భర్తీ చేయుటకు సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బడులను అభివృద్ధి చేయాలని నూతన ఆవాసాలు పెరిగినందున పాఠ శాలలను ప్రారంభించాలని ప్రభుత్వ పాఠ శాలలను అభివృద్ధి చేయడం ద్వారా మాత్రమే సమాజంలో అంతరాలు తొలగిపోతాయని అన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత ఉందని ఉపాధ్యాయుల అసమతుల్యత ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ లేకపోవడం లోపాలు వీటిని సరిదిద్దేందుకు కృషి చేయకపోవడం శోచనీయమన్నారు. 15 శాతం బడ్జెట్ కేటాయిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడవ విడత బడ్జెట్ లో కూడా 8.22 శాతం దాటలేదన్నారు. యంగ్ ఇండియా టిపిఎస్ పేరుతో జనాకర్షక పాఠశాలలు కాకుండా ప్రజ లందరికీ అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠ శాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా ఆఫీస్ బేరర్లు ఎం.రాజయ్య, ఎస్.వెంకటేశ్వర్లు, హథీరాం, తావుర్య, రాము, పద్మారాణి, ఆర్.రమేష్ కుమార్, గంగాధర్, డి.దాసు, ఎం.సత్యనారాయణ, షేక్ పాషా, మంగీలాల్, సత్యశ్రీ, జానకి, జయాబయి, యశోద, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.కిషోర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షుడిగా కొణపర్తి శరత్ బాబు ఏకగ్రీవ ఎన్నిక

**నందిగామ, జూన్ 14 (ప్రజావీక్షణం):**

నందిగామ పట్టణ మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ పెద్దలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ నూతన అధ్యక్షుడిగా కొణపర్తి శరత్ బాబును ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు పెద్దలు అధికారికంగా ప్రకటించారు. పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో జరిగిన ముఖ్య సమావేశంలో సర్వసభ్యుల సమక్షంలో ఈ క్రింది వారిని నూతన కమిటీ నిర్వాహకులుగా నియమించారు:
అధ్యక్షుడు: కొణపర్తి శరత్ బాబు
వర్కింగ్ ప్రెసిడెంట్: నూతక్కి సాంబశివరావు
ప్రధాన కార్యదర్శి: వేల్పూరు రవి
కోశాధికారి: బాణాల నరసింహచారి
నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కొణపర్తి శరత్ బాబును కుల పెద్దలు, బంధుమిత్రులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సత్కరించి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి, సంఘాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని, అందరినీ కలుపుకొని ముందుకెళ్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు కనకాల మోహన్ రావు, తునికిపాటి అమరయ్య, బానాల నాగేశ్వరరావు, పడకండ్ల హేమంత్ కుమార్, బాణాల అజయ్, దమ్మాలపాటి భద్రయ్య, సంఘ మాజీ అధ్యక్షుడు మునగంటి కానేశ్వర రావు, సత్యనారాయణతో పాటు నందిగామ మండల విశ్వబ్రాహ్మణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## సింగరేణిలో కాళీ పోస్టుల భర్తీకి వ్రాత పరీక్ష

**భద్రాద్రి కొత్తగూడెం,జూన్14(ప్రజావీక్షణం):**

సింగరేణి కాలరీస్ కంపెనీలో ఖాళీగా ఉన్న జూనియర్ కెమిస్ట్ జూనియర్ టెక్నికల్ ఇన్స్పెక్టర్ టి అండ్ ఎస్ గ్రేడ్ డి పోస్టులను అంతర్గత అభ్యర్థులతో భర్తీ చేసే దానిలో భాగంగా ఆదివారం సింగరేణి మహిళా డిగ్రీ పిజి జూనియర్ కళాశాలలో వ్రాత పరీక్ష నిర్వహించటం జరిగింది. పరీక్ష తీరును సింగరేణి జిఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సి ఏ.జే.ఎం మురళీధరరావు, ఏజిఎం(విజిలెన్స్)ఎస్.వి.మురళీధర రాజు పర్యవేక్షించి పరీక్ష పూర్తిగా మెరిట్ పై ఆధారపడి ఉంటుందని దళారులకు ఎలాంటి ప్రమేయం ఉండదని వారిని నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు. ఈ పరీక్ష ఫలితాలు సింగరేణి వెబ్ సైట్, సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం వద్ద నోటీస్ బోర్డుద్వారా తెలియజేయటం జరుగుతుందని తెలియజేశారు. ఈ పరీక్ష నిర్వహణ పరిశీలనలో డిజిఎం(పర్సనల్)పి.వేణు గోపాలరావు, పర్సనల్ మేనేజర్ బి.సమ్మయ్య డివై.పిఎంలు డి.నాగేశ్వర రావు, కే.సంతోష్ కుమార్, విజిలెన్స్ ఆఫీసర్స్ ఎస్‌డి.షాకిర్ మొహినుద్దీన్, ఎండి.హాషిం పాషా, సింగరేణి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి.సంధ్యా రాణి, డిగ్రీ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.మంజుల ఇతర అధికారులు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ సిబ్బంది రిక్రూట్మెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు.



## 12వ వార్డులో రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

మురుగు నీటితో కాలనీవాసులకు ఇబ్బందులు

సమస్యల పరిష్కారించాలని డిమాండ్

**తూప్రాన్, జూన్ 14. ప్రజావీక్షణం ప్రతినిధి:**

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు మహంకాళి ఆలయం వెనుక వీధిలో డ్రైనేజీ పైప్‌లైన్ లీకేజీ కారణంగా మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ కాలనీ వాసులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది. రోడ్డంతా మురుగునీటితో నిండి పోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బం దులు ఎదుర్కొం టున్నారు. అదే వార్డు లోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సర ఫరా అంత రాయం కూడా నెల కొనడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో మురుగునీటి నిల్వల వల్ల దోమలు, విషసర్పాలు వచ్చే ప్రమాదం ఉందని కాలనీవాసులు భయ పడుతున్నారు. డ్రైనేజీ లీకేజీ సమస్యతో పాటు వార్డులో ఉన్న ఇతర మౌలిక వసతుల సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరు తున్నారు. ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ వార్డును సంద ర్శించి పరిస్థితిని పరిశీలించి తక్షణ చర్యలు తీసు కోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. స్థానికుల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు.




## ఉద్యమ కళాకారుల సేవలు తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయం

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**మంచిర్యాల జిల్లా,జూన్ 14,ప్రజావీక్షణం**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉద్యమ కళాకారులు పోషించిన పాత్ర ఎంతో గొప్పదని,వారి త్యాగాలు,కృషి తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన ఉద్యమ కళాకారుల సన్మాన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యమ కళాకారులను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గ్రామీణ ప్రాంతాల వరకు తీసుకెళ్లడంలో కళాకారుల పాత్ర కీలకమైందన్నారు. పాటలు,నృత్యాలు,సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపి ఉద్యమ విజయానికి వారు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమ కళాకారుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,వారి సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన ప్రతి ఒక్కరి సేవలను గుర్తుంచుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్,అధికారులు,ప్రజాప్రతినిధులు,ఉద్యమ కళాకారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాల పునఃప్రారంభానికి ముందు శ్రమదానం

తూప్రాన్ పుట్టకోట ప్రైమరీ స్కూల్‌లో పరిశుభ్రత కార్యక్రమం

**తూప్రాన్, జూన్ 14. ప్రజావీక్షణం ప్రతినిధి:**

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ 4వ వార్డు పరిధిలోని పుట్టకోట ప్రైమరీ పాఠశాల పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. 4వ వార్డు కౌన్సిలర్ జైపాల్ రాథోడ్, 13వ వార్డు కౌన్సిలర్ చెలిమెల రాములు ఆధ్వర్యంలో స్థానిక యువకులు, కార్యకర్తలు కలిసి పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. గత కొన్ని రోజులుగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, పాఠశాల గదులు, బెంచీలు, పరిసరాలను నీటితో కడిగి పరిశుభ్రపరిచారు. విద్యార్థులు తిరిగి పాఠశాలకు వచ్చే సమయానికి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ పాఠశాలలు విద్యార్థులకు విజ్ఞాన ఆలయాలని, వాటి పరిశు భ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పట్లోరి లక్ష్మణ్, ఉపాధ్యాయులు నూస్రత్, తిరుమల, రేఖ, ఆయా మౌనిక, తల్లిదండ్రులు, విద్యార్థులు. ఉపాధ్యాయులు , యూత్ సభ్యులు కొట్టముల ఉపేందర్, నాని వెంకట్, అరకల మల్లేష్, చెలిమెల సతీష్, ప్రశాంత్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.









ప్రజావీక్షణం
దినపత్రిక

# ప్రధాని "మోడీ" సాధించిన విజయాలను ప్రచారం చేయాలి

**-ఉజ్వల సడక్ ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలేన్నో ప్రవేశం-రాష్టంలో బిజెపి జెండా ఎగిరేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి**

**-విలేకరుల సమావేశంలో ఉదయ్ ప్రతాప్, బైరెడ్డి**

**భద్రాద్రి కొత్తగూడెం(ప్రజావీక్షణం):**

12 ఏళ్ల కాలంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ సాధించిన విజయాలు దేశాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లారు అనే అంశాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా ఇన్చార్జి ఉదయ్ ప్రతాప్ పిలుపునిచ్చారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేయుచున్న విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి రామలింగేశ్వర రావు సమక్షంలో జిల్లా పార్టీ అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి సమక్షంలో ఆయన మాట్లాడారు. 12ఏళ్ల కాలంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ సాధించినటువంటి విజయాలు దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లాయన్నారు. కేంద్ర ప్రభుత్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అనేక ప్రజా ప్రయోజన కార్యక్రమాలను సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలో తెలంగాణ రాష్ట్రంలో అలాగే జిల్లాలో అధికారమే లక్ష్యంగా బిజెపి శ్రేణులు పని చేస్తారని పేర్కొన్నారు. అయితే భద్రాచలం రోడ్, సత్తుపల్లి రైల్వే లైన్ పని పూర్తి చేసిన ఘనత కేంద్రంలో ఉన్నటువంటి భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానిదేనన్నారు. అంతేగాక ఉజ్వల యోజన ప్రధానమంత్రి సడక్ యోజన ఆయుష్మాన్ భారత్ గరీబ్ కళ్యాణ్ యోజన మేకిన్ ఇండియా డిజిటల్ ఇండియా స్టాండప్ ఇండియా తదితర పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కూడా ప్రధానమంత్రి మోడీదేనని వివరించడం జరిగింది. మరి ముఖ్యంగా ఈ యొక్క తెలంగాణ రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ అనే ఒక పథకాన్ని అమలు పరచడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచల శ్రీ రాముడి దేవాలయ అభివృద్ధికి రు.98 కోట్ల ఖర్చు చేసిన ఘనత కేంద్రంలో బిజెపి ప్రభుత్వానిదేనన్నారు. అంతేగాక మోడీ చొరవే నని తెలిపారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బి ఆర్ ఎస్ ప్రభుత్వానికి గానీ ఇప్పుడు అధికారంలో ఉన్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని వ్యాఖ్యానించారు.




భద్రాచల శ్రీ రాముని ఆలయ అభివృద్ధిని పట్టించుకున్న పాపాన లేదని విమర్శించారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతమైనటువంటి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకి కేంద్ర ప్రభుత్వం గత పాలకుల కంటే కూడా ఎంతో ప్రోత్సహిస్తుందని తెలియజేశారు. ఇదే ఉమ్మడి జిల్లాకు సంబంధించి ముగ్గురు మంత్రులు ఉన్నా కూడా జిల్లాకి ఎలాంటి అభివృద్ధి పనులు చేయకపోగా అదే పనిగా భారతీయ జనతా పార్టీని విమర్శిస్తూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో చిన్నారిపై ఒక ముస్లిం యువకుడు దారుణానికి వడిగడితే కనీసం స్పందించడానికి మనసు రాని చేతకాని ప్రభుత్వమని విమర్శించారు. ప్రభుత్వంలో పని చేస్తున్న మంత్రులని తీవ్రస్థాయిలో విమర్శించారు. కేవలం ఒక సామాజిక వర్గానికి సంబంధించిన వ్యక్తి అని మంత్రులు ఎవరు కూడాను నోరు మెదపని పరిస్థితి అని తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్టంలో కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు మాత్రమే కొనసాగుతున్నాయని వ్యాఖ్యానించారు. ప్రజల సంక్షేమాన్ని దేశ అభివృద్ధిని రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేసారని ఆరోపించారు. ముఖ్యంగా బీజేపీని విమర్శించే ప్రభుత్వాలు ఏ విధంగా అధికారానికి దూరమయ్యాయో వివరించారు. ముఖ్యంగా రాబోవు రోజులలో భారతీయ జనతా పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తుందని ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షురాలు చెరుకు భాగ్యలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ వెంకన్న నాయక్, భోగి కృష్ణ, పుణ్యం బిక్షపతి, కార్యదర్శులు తుంపూరిశివ, పుణ్యా నాయక్, ఎస్ఐఆర్ కన్వీనర్ మోహనకృష్ణ, మీడియా కన్వీనర్ రామారావు, జిల్లా కార్యాలయ కార్యదర్శి దురిశెట్టి కుమార్, మహిళా నాయకురాలు సముద్రాల గాయత్రి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయులు, వంట కార్మికులకు అవగాహన సదస్సు

**దోమ, ప్రజావీక్షణం ప్రతినిధి జూన్ 14:**

దోమ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులకు అవగాహన కార్యక్రమాన్ని దోమ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దోమ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం ఆంజనేయులు సర్‌తో పాటు మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వంట కార్మికులు పాల్గొన్నారు. రేపటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి పాఠశాలలో వంట గదులు, వంట పాత్రలు, నీటి ట్యాంకులను పూర్తిగా శుభ్రపరచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రమైన కూరగాయలు, నాణ్యమైన ఆహార పదార్థాలు ఉపయోగించి భోజనం తయారు చేసి అందించాలని ఆదేశించారు. అదేవిధంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ రేపటి నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. ఈ పథకం కింద విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 7 గంటలలోపు మెనూ ప్రకారం టిఫిన్, పాలు అందజేయనున్నట్లు వివరించారు. దోమ మండలం సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలుకు ఎంపిక కావడం ఆనందదాయకమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ వెంకట్ పిలుపునిచ్చారు. పథకం విజయవంతం కావడానికి ఉపాధ్యాయులు, వంట కార్మికులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.





# సేవే లక్ష్యం... 57వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన డా. ఏలేటి రాజశేఖర్ రెడ్డి

**-ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా గవర్నర్ చేతుల మీదుగా సన్మానం**

**-రక్తదానం మహాదానం..**

**-గవర్నర్ చేతుల మీదుగా డా. రాజశేఖర్ రెడ్డికి సన్మానం**

**-57వ రక్తదానం.. సేవా స్ఫూర్తికి గవర్నర్ ప్రశంసలు**

**హైదరాబాద్, జూన్ 14. ప్రజావీక్షణం ప్రతినిధి:**

"రక్తదానం మహాదానం... ఒకరు రక్తం దానం చేస్తే ముగ్గురు నుంచి నలుగురి ప్రాణాలను కాపాడిన వారవుతారు. ప్రమాదాలు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం అందక ఎంతోమంది మృత్యువు అంచునకు చేరుకుంటున్నారు. అలాంటి సమయంలో స్వచ్ఛంద రక్తదాతలు సమాజానికి ప్రాణదాతలుగా నిలుస్తున్నారు" అని తెలంగాణ రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు శ్రీ శివప్రతాప్ శుక్ల పేర్కొన్నారు.
ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్‌లోని రాజ్ భవన్ సంస్కృతి భవన్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెదక్ జిల్లా శాఖ చైర్మన్, ప్రముఖ సామాజిక సేవకుడు లయన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి తన జీవితంలో 57వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేసి మరోసారి సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. రక్తదాన శిబిరాన్ని సందర్శించిన గవర్నర్ శివప్రతాప్ శుక్ల, డా. రాజశేఖర్ రెడ్డి సేవలను ప్రత్యేకంగా అభినందించారు. ఎన్నో సంవత్సరాలుగా నిరంతరంగా రక్తదానం చేస్తూ, యువతలో అవగాహన కల్పిస్తూ, సమాజంలో మానవతా విలువలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నందుకు ప్రశంసాపత్రాన్ని అందజేసి సత్కరించారు. డా. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ "రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుంది. ప్రతి ఆరోగ్యవంతుడు సంవత్సరానికి కనీసం ఒకసారి అయినా రక్తదానం చేయాలి. యువత ముందుకు వచ్చి రక్తదాన ఉద్యమాన్ని బలోపేతం చేయాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డి. దాన కిషోర్, సీఈఓ ప్రొఫెసర్ ఎ. శ్రీరాములు, కామారెడ్డి ఆర్కే సంస్థల అధినేత ఎం. జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అత్యధిక సార్లు రక్తదానం చేసిన రక్తదాతలు, రక్తదాన శిబిరాల నిర్వహణకు సహకరించిన సేవాదాతలను గవర్నర్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు.




సమాజ సేవనే లక్ష్యంగా చేసుకొని నిరంతరం మానవతా కార్యక్రమాల్లో ముందుండే డా. ఏలేటి రాజశేఖర్ రెడ్డి చేసిన 57వ రక్తదానం పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. రక్తదానం ద్వారా ప్రాణాలను కాపాడే ఈ మహోన్నత సేవను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

# నాలుగవ వార్డులో దెబ్బతిన్న మంచినీటి పైప్ లైన్ ను మరమ్మతులు చేపించిన వార్డు సభ్యులు..

**దామరచర్ల ప్రజావీక్షణం ప్రతినిధి జూన్ 14.**

మండల కేంద్రంలోని నాలుగవ వార్డులో మంచినీటి సరఫరా పైప్ లైన్ దెబ్బతినడంతో సమస్య ఏర్పడింది,సమస్యను గుర్తించిన వార్డు సభ్యులు షైక్ నసీమా రఫీ భాయ్ వెంటనే స్పందించి గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు,వార్డు సభ్యుల సూచన మేరకు గ్రామపంచాయతీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని దెబ్బతిన్న పైప్ లైన్ కు మరమ్మతు పనులు చేపట్టారు,పైప్ లైన్ మరమ్మతు పూర్తి కావడంతో పాటు ప్రజలకు తిరిగి సక్రమంగా తాగునీటి సరఫరా అందుబాటులోకి వచ్చింది,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలు తక్షణమే పరిష్కరించడంలో సహకరించిన గ్రామపంచాయతీ సిబ్బందికి మరియు వార్డు సభ్యులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు,వార్డు అభివృద్ధికి ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడు ముందుంటామని వార్డు సభ్యులు షేక్ నసీమ రఫీ భాయ్ తెలిపారు.



# బోనం ఎత్తిన మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి

**చిన్నశంకరంపేట జూన్ 14,( ప్రజావీక్షణం ప్రతినిధి)**

చిన్న శంకరంపేట మండలంలోని అంబాజీపేట గ్రామంలో ఆదివారం పోచమ్మ దుర్గామాత గ్రామ దేవతలకు గ్రామ ప్రజలు బోనాలు సమర్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి హాజరై బోనం ఎత్తుకొని అమ్మవారికి బోనం సమర్పించారు ఈ సందర్భంగా ఆమె దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో బోనాలతో పాటు పోతరాజుల విన్యాసాలతో శివసత్తుల నృత్యాలతో అందరిని అలరింప చేశారు. ఈ కార్యక్రమంలో అంబాజీపేట గ్రామసర్పంచ్ సుంకరి సబితా రవి గౌడ్ బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, మాజీ సర్పంచ్ కుమార్ గౌడ్, పూలపల్లి యాదగిరి అంబాజీపేట బిఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామంలోని వివిధ పార్టీ నాయకులు కుల సంఘ నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com